క్లుప్తంగా

మద్ది అంజన్న సేవలో ఆర్డీఓ


ఆర్డీఓకి చిత్రపటం అందజేస్తున్న చందన

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానాన్ని స్వామివారిని సోమవారం ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన ఎంవీ రమణ దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన ఆలయ మర్యాదలతో ఆర్డీఓకి స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆర్డీఓకి అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఏసీ చందన ఆర్డీఓకి స్వామి వారి ప్రసాదాన్ని చిత్రపటాన్ని అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

గ్రామస్తుల సహకారంతో పంచాయతీకి ట్రాక్టర్


గవరవరంలో ట్రాక్టర్‌తో దాతలు

కొయ్యలగూడెం: గవరవరం పంచాయతీ గ్రామస్తుల సహకారంతో ట్రాక్టర్‌ను సమకూర్చినట్టు సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహరాజు సోమవారం తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దల సహకారంతో సుమారు రూ.7.30 లక్షలతో ట్రాక్టర్, ట్రక్కును కొనుగోలు చేసి పంచాయతీ అవసరాల నిమిత్తం వినియోగిస్తామని పేర్కొన్నారు. దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పశుసంవర్ధక శాఖ సంఘ ప్రధాన కార్యదర్శిగా బిరుదగడ్ల


బిరుదుగడ్ల రాజు

కొయ్యలగూడెం: జిల్లా పసుపు సంవర్ధక శాఖ సహాయకుల సంఘ ప్రధాన కార్యదర్శిగా గవరవరం గ్రామానికి చెందిన బిరుదుగడ్ల రాజు ఎన్నికయ్యారు. ఏలూరులో సోమవారం నిర్వహించిన ఏలూరు జిల్లా వివిధ మండలాలకు చెందిన పశుసంవర్ధక సహాయకులు సంఘ సమావేశంలో తనను ఎన్నుకున్నట్టు సోమవారం రాజు పేర్కొన్నారు. పశుసంవర్ధ సహాయకుల సంక్షేమానికి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు.

ఘనంగా గౌరీ శంకరుల మహోత్సవం


మహోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక 42వ డివిజన్‌లోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి, జానకి రామాంజనేయ, గౌరీ శంకర, సాయి మందిరంలో గౌరీ దేవి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు, మహిళ భక్త బృందం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నగర పొలిమేరల్లోని వరి పొలం వద్దకు వెళ్లి గౌరీ దేవికి ప్రతీకగా వరి దుబ్బులను మేళ తాళాలతో, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి నామస్మరణతో నగర వీధుల్లో పాదయాత్ర చేసుకుంటూ అత్తగారి ఇంటి నుంచి పుట్టింటికి చేర్చారు. సాయంత్రం పుట్టింటి నుంచి మెట్టినింటికి ట్రాక్టర్‌పై నగర వీధులలో అమ్మవారి, స్వామి వారి నామస్మరణలతో, భాజా భజంత్రీలతో, విద్యుత్ అలంకరణ, వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి ఆలయానికి చేర్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.

మైభారత్‌లో భాగస్వాములు కావాలి



మైభారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు రూరల్ : మైభారత్ కార్యక్రమంలో దేశ ప్రజలను సేవా కార్యక్రమాలకు పురిగొల్పిందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నెహ్రూ యువకేంద్రం అధికారి దూలం కిషోర్ అన్నారు. సోమవారం ఏలూరులో నిర్వహించిన మైభారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మైభారత్‌లో దేశ వ్యాప్తంగా ప్రముఖులు పాల్గొని సమాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపా రు. జిల్లాలో మూడురోజుల పాటు ఎన్‌వైకే చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రుల పరిశుభ్రత, రైతుబజార్ల పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, యువతీ, యువకులు పాల్గొనాలని కోరారు. తొలుత నగర కార్పొరేషన్ శానటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఏడుకొండలు, ఆఫీసర్ సుధాకర్, సెయింట్ ఆన్స్ కాలేజీ, ఏలూరు విన్సెంట్ డీపాల్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఎన్‌వైకే వాలంటీర్లు పత్తేబాద్ రైతు బజారులో చెత్త సేకరించారు.

సిబ్బంది కొరత.. కొరవడిన పర్యవేక్షణ

- పాడైన కేకేఎం జలాశయం పంట కాలువ గేట్ వాల్స్
- ఆక్రమణలో కాలువ గట్లు
- 2015 తర్వాత ఏర్పడని నీటి సంఘాలు


కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం


మొక్కలతో నిండిపోయిన జలాశయం కుడి పంట కాలువ

జంగారెడ్డిగూడెం రూరల్: జిల్లాలో మధ్య తరహా ప్రాజెక్టుగా పేరున్న జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం ప్రాజెక్టు (ఇరిగేషన్ శాఖ)ను సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది. ప్రాజెక్టు ప్రారంభమైన మొదట్లో సరిపడా సిబ్బంది ఉన్నా.. ఆ శాఖలో రానురాను సిబ్బంది ఉద్యోగ విరమణ చేయడం, వారి స్థానంలో కొత్త సిబ్బందిని నియమించకపోవడంతో కొన్నేళ్లగా సిబ్బంది కొరత ఏర్పడింది. గతంలో ఆయా పనుల నిర్వహణకు సంబంధించి డీఈ, జేఈఈ, ఏఈ, డ్యాం వద్ద, కాలువలపై పనిచేసే సిబ్బంది, లస్కర్లు సుమారు 80 మంది వరకు పనిచేసినట్టు ఇరిగేషన్ శాఖ రికార్డుల ద్వారా తెలుస్తోంది. సిబ్బంది కొరతతో కాలువలు, డ్యాం పర్యవేక్షణ కొరవడుతోంది. పంట కాలువలలో పాడైన గేట్ వాల్వ్‌లు మరమ్మతులు నోచుకోవడం లేదు. కాలువ గట్లు అన్యాక్రాంతమవుతున్నాయి. సాగునీటి సంఘాలు ఏర్పడకపోవడం ఇలా సమస్యలను ఎర్రకాలువ ప్రాజెక్టును పట్టిపీడిస్తున్నాయి.

నీటి పారుదలకు ఆటంకాలు

ఎర్రకాలువ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా రబీ, ఖరీఫ్ సీజన్‌లో సాగునీటిని అందిస్తుంటారు. రైతుల నుంచి ఐదు వేల ఎకరాల భూములను సేకరణ చేసి కొంగువారిగూడెంలో ఎర్రకాలువ డ్యాం నిర్మాణాన్ని చేపట్టారు. 85.5 మీటర్ల నీటిని నిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. ప్రస్తుతం 56 కిలో మీటర్ల ఉన్న కుడి కాలువ ద్వారా 10 వేల ఎకరాలకు, 7.59 కిలో మీటర్లు ఉన్న ఎడమ కాలువ ద్వారా ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. గతంలో కుడి కాలువ కింద 15 మంది లస్కర్లు, ఎడమ కాలువ కింద నలుగురు లస్కర్లు గతంలో పనిచేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ రెండు కాలువలపై ప్రస్తుతం ఒక్క లస్కర్ కూడా లేకపోవడంతో కాలువలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో అనధికారికంగా బోదెలు తవ్వి నీటిని తోడేస్తున్నారు. కాలువల్లో తూడు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో సాగునీటి పారుదలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కాలువలలో గేట్ వాల్వ్‌లు, లాక్‌సిస్టం, రెగ్యూలేటర్ల సిస్టంలు కూడా పూర్తిగా పాడైంది.

భర్తీ కాని పోస్టులు

ఎర్రకాలువ ప్రాజెక్టుపై పనిచేయడానికి సిబ్బంది అవసరం ఉన్నా.. నియామకంపై శ్రద్ధ చూపడం లేదు, పోస్టులు భర్తీ కాకపోవడంతో డ్యాం మెయింట్ నెస్, కాలువల పర్యవేక్షణ కొరవడింది. మెయింట్‌నెస్ పనులు చూసేందుకు ప్రస్తుతం ఆరుగురు ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వీరికి గత రెండేళ్లుగా జీతాలు రావడం లేదు. సుమారు రూ.25 లక్షలు వీరికి చెల్లించాల్సి ఉంది. ఇటీవల 3 నెలల జీతాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా విడుదల కాలేదు. డ్యాం వద్ద నీటి విడుదలకు ఇద్దరు ఆపరేటర్లు, 1 ఎలక్ట్రీషన్, 1, హెల్పర్, 3వాచ్‌మేన్‌లు, ఇద్దరు లస్కర్లు పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. అలాగే కుడి, ఎడమ పంట కాలువ పర్యవేక్షణ చూసేందుకు ఆరు లస్కర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

సాగునీటి సంఘాలను ఏర్పాటుచేయాలి

2015 సంవత్సరం తర్వాత నుంచి ఇప్పటి వరకు సాగునీటి సంఘాలు ఏర్పడలేదు. రైతులకు, ప్రభుత్వానికి సాగునీటి సంఘాలు వారధిగా నిలుస్తూ పనిచేస్తుంటాయి. కాలువల నిర్వహణ, నీటి వినియోగం, తూడు, పిచ్చి మొక్కలు తొలగింపు, రైతులు ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా సాగునీటి సంఘాలు పనిచేస్తుంటాయి. సంఘం ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని రైతులు, రైతులు కోరుతున్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పర్యవేక్షణ

ఎర్రకాలువ ప్రాజెక్టుపై పనిచేసే సిబ్బంది కొరత ఉంది. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఆరుగురితో డ్యాం పర్యవేక్షణ పనులు చేస్తున్నాం. లస్కర్లు, వాచ్‌మేన్‌లు, ఆపరేటర్లు అవసరం ఉంది. కుడి, ఎడమ కాలువల ద్వారా రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగునీటి అందిస్తూ వస్తున్నాం.

– రాంబాబు, ఇరిగేషన్ శాఖ డీఈ

వృథాగా పోతున్న నీరు



మెట్ట ప్రాంత రైతాంగం ఎర్రకాలువ కుడి, ఎడమ కాలువ ద్వారా అందే సాగునీటిపై ఆధారపడుతుంటారు. పంట కాలువలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలు పరిష్కరించాలి. ఫీల్డ్ ఛానల్స్ అన్యాక్రాంతం కావడంతో చివరి రైతులకు సాగునీరు అందని పరిస్థితులు నెలకొంటున్నాయి. కాలువలపై ఒక్క లస్కర్ కూడా లేదు. గేట్లు పూర్తిగా పాడవ్వడంతో పాటు, అండర్ సైఫన్‌లు పూర్తిగా పాడవ్వడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో రైతులు ఇసుక బస్తాలు, గడ్డి మోపులతో అడ్డుకట్ట వేయాల్సి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అనేక చోట్ల కాలువ గట్లు అన్యాక్రాంతమయ్యాయి. ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలి.

– దల్లి రామాంజనేయరెడ్డి, రైతు, గురవాయిగూడెం

హాస్టల్‌ను మరో భవనంలోకి మార్చుతాం

కామవరపుకోట: సంక్షేమ గృహాలు సంక్షోభాలకు నిలయాలు అనే శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కామవరపుకోటలో శిథిల అద్దె భవనంలో కొనసాగుతున్న బాలుర బీసీ వసతి గృహాన్ని త్వరలో అన్ని సౌకర్యాలతో మరో భవనంలోకి మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత జిల్లా అధికారి వి.నాగరాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రక్తదాన శిబిరం

కొయ్యలగూడెం: లివింగ్ సాక్రిఫైస్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన సేకరణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ దేవ సహాయం ఆధ్వర్యంలో 28 యూనిట్ల రక్తాన్ని దాతలు అందించారు. తమ సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసినట్టు ఆర్గనైజర్ డి.కనకరాజు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు కమిషనర్ కేవీ రమణ తెలిపారు. సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు.

పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

వేలేరుపాడు: భారతదేశంలో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా తిరుగుబాటు తీసుకురావాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ లెనిన్ వర్ధంతి సభ వేలేరుపాడు మండలం కోయమాధవరంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, బాచినేని సత్యనారాయణ, గడ్డాల ముత్యాలరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్కే గౌస్ మాట్లాడుతూ లెనిన్ సిద్ధాంతాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు, 200 మంది పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం

జంగారెడ్డిగూడెం: ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలు క్షుణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆర్డీఓ ఎంవీ రమణ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 19 అర్జీలు వచ్చాయని ఆర్డీఓ తెలిపారు. భూమికి ప్రొటెక్షన్ ఆర్డర్ ఇప్పించాలని కన్నాపురానికి చెందిన కఠారి సుబ్రహ్మణ్యం, చాపల ధర్మరాజు, రాజుపాలెంకు చెందిన చొప్పర వర్ధనదేవి దరఖాస్తు చేశారు. వెలగపాడు గ్రామానికి చెందిన చింతపల్లి సుబ్బారావు, కొత్తగూడెం గ్రామానికి చెందిన చొప్పా వీరవెంకట గంగాధరరావు కోర్టు తీర్పు వచ్చేంత వరకు ఆయా సర్వే నెంబర్లలోని భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో పేర్లు మార్పు చేయరాదని కోరారు. తనను తన కుమారుడు ఇంటి నుంచి గెంటివేయాలని చూస్తున్నాడని జంగారెడ్డిగూడెంకు చెందిన అమ్ముతాల వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. దేవులపల్లికి చెందిన పాతూరి సుబ్బారావు తన భూమికి వేరే వారిపేరున అడంగల్ ఉందని, దానిని మార్పు చేయాలని, జంగారెడ్డిగూడెంకు చెందిన దాకారపు చక్రధరరావు చింతలపూడి ఎత్తిపోతల పథకం భూమి నష్టపరిహారం ఇప్పించాలని, చిగురుమామిడికి చెందిన కొమ్మినేని మోహన్‌రావు, మరికొందరు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మించుకోవడానికి భూమిని కేటాయించాలని కోరారు. లక్కవరంలో సీలింగ్ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెం చెందిన ఎం.రామ్మోహన్‌రావు దరఖాస్తు అందించారు.

జీఓ 3కి చట్టబద్ధత కోరుతూ ధర్నా


ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘం నాయకులు

కుక్కునూరు: జీఓ నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా జీఓ 3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం వెంటనే అమలు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మెగా డీఎస్సీ ఏర్పాటుతోపాటు ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. పోడు భూములు సాగుచేసుకుంటున్న గిరిజనులకు హక్కు పత్రాలివ్వాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కూరం సంజీవరావు,మండల అధ్యక్షుడు పైదా చిన్నబాబు, ప్రచార కార్యదర్శి వేణుగోపాల్, మాధవరం సర్పంచ్ పాయం సత్యనారాయణ, అశోక్, గొర్రె కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం


పత్తి కొనుగోలు వివరాలను వెల్లడిస్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి మెహరాజ్ పాషా

చింతలపూడి : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు మార్కెట్ కమిటీ కార్యదర్శి కె మెహరాజ్ పాషా తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పత్తి పంట క్వింటా సాధారణ రకం రూ.7,471, పొడవాటి రకం క్వింటా రూ.7,521 కొంటున్నట్టు చెప్పారు. చింతలపూడి వ్యవసాయ మార్కెట్ పరిధిలోని జంగారెడ్డిగూడెం నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లు, గుంటూరు జిల్లా పత్తిపాడు శివపార్వతి కాటన్ జిన్నింగ్ మిల్లులో పత్తి రైతులు పత్తి పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలన్నారు. రైతులు సీసీఐకి పత్తిని తీసుకొచ్చే ముందు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ పత్రాలను కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని టోకెన్ పొందాలని సూచించారు. తేమ 8 శాతం ఉంలాని, 8 శాతం కంటే తక్కువ ఉన్న పంటకు ప్రతి శాతానికీ రూ.75.25 చొప్పున ధర తగ్గుతుందని చెప్పారు. 12 శాతం కంటే మించి తేమ ఉంటే సీసీఐ కొనుగోలు చేయదని తెలిపారు. కార్యక్రమంలో కాటన్ కార్పొరేషన్ జంగారెడ్డిగూడెం పత్తి కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి కె.రవి ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత రోడ్లు నిర్మించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మన్నవ కృష్ణ

కొయ్యలగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను వెంటనే నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిమ్మనకుంట గ్రామంలో సీపీఐ నాయకులతో సోమవారం ఏర్పాటుచేసిన శాఖా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోతులమయంగా మారిని గ్రామీణ రహదారులను నిర్మించాలని అన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 పథకలలో హామీలను అమలు చేయాలని, సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఇల్లు లేని నిరుపేదలకు మూడు సెంట్లు భూమి, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, దుగ్గిరాల నారాయణరావు, ధగాని సుబ్బారావు, చొక్కా బాలస్వామి, రాపోలు భాస్కరరావు, చంద్ర వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ ఆఫీస్ వద్ద సోమవారం పారిశుద్ధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు బి.బాలరాజు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం కనీసం మౌలిక సదుపాయాల అందించడం లేదన్నారు. చీపుళ్లు, పారలు, సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిక్షా, ట్రాక్టర్ రిపేర్లు చేయించాలని, డెత్ పోస్టులు ఖాళీ అయిన చోట వారి బిడ్డలకు అవకాశం ఇవ్వాలని, ఈఎస్ఐ హాస్పిటల్ జంగారెడ్డిగూడెంలో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ కార్యదర్శి షేక్ సుభాషిని, మున్సిపల్ కార్మికుల సంఘ కార్యదర్శి జి.లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు వి.రాజుప్రసాద్, సహాయ కార్యదర్శి జి.వెంకటేష్, జి.నాగరాజు, శ్రీను, ఏసు, ముప్పిడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చెట్లు పెంచుకునే అవకాశం కల్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న కుంచే వసంతరావు

చింతలపూడి: వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునే అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు ముల్లగిరి లాజరు అధ్యక్షతన నిర్వహించారు. వసంతరావు మాట్లాడుతూ వన సంరక్షణ సమితులు 1996లో ఏర్పాటు చేశారని, నాటి నుంచి అడవి భూముల్లో ఫారెస్ట్ అధికారులు వీఎస్ఎస్ సభ్యులు ఉమ్మడి యాజమాన్యం పద్ధతిలో మొక్కలు వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సరైన సమయంలో మొక్కలు ఇవ్వకపోవడం వల్ల, వేసిన మొక్కలు పెరగక వాటిపై శ్రద్ధ లేదని, ఈ నేపథ్యంలో వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా మొక్కలు పెంచుకునే అవకాశం కల్పించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఫారెస్ట్ అధికారులు వన సంరక్షణ సమితిలో జామాయిల్ వేసారని, అవి నరకడం లేదని, అవి పెద్దపెద్ద చెట్లయితే పనికి రాకుండా పోతున్నాయని తెలిపారు. రేచర్ల వీఎస్ఎస్‌లో జామాయిల్ నరకడం కోసం ఇప్పటికి మూడుసార్లు నెంబర్ ఇచ్చారని, నరకడానికి పర్మిషన్ ఇవ్వాలని ఫారెస్ట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు బోడ వజ్రం, మండల కార్యదర్శి ఇస్తరాకులు వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు ముల్లగిరి అలెగ్జాండర్, పార్టీ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా కన్వీనర్ జె.దుర్గాప్రసాద్, కో కన్వీనర్ సీహెచ్ సూర్యచక్రవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత ప్రొఫార్మాలో దరఖాస్తులతోపాటు అన్ని కాపీలను జతచేసిన నవంబరు 11లోగా సంచాలకులు, బాలల సంక్షేమం, సంస్కరణ సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ, విజయవాడ కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాలకు ఏలూరు జిల్లా కన్వీనర్ జె.దుర్గాప్రసాద్, జిల్లా పర్యవేక్షణ అధికారి ఫోన్ నెంబర్ 91000 45424, కో కన్వీనర్ సీహెచ్ సూర్య చక్రవేణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఫోన్ నెంబర్ 79015 97267లో సంప్రదించవచ్చనని పేర్కొన్నారు.

ఏలూరు నుంచి ఆశ్రం ఉచిత బస్సు

ఏలూరు రూరల్ : ఏలూరు నగర ప్రజల సౌకర్యార్థం ఉచిత బస్సు నడుపుతున్నట్టు ఆశ్రం సీఈఓ కె.హనుమంతురావు తెలిపారు. సోమవారం తంగెళ్లమూడి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటుచేసిన ఉచిత బస్సును ఎమ్మెల్యే బడేటి చంటి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు పెట్రోల్ బంక్ వద్ద నుంచి బస్సు ప్రారంభమౌతుందన్నారు. అక్కడ నుంచి అశోక్‌నగర్, పెద్దాసుపత్రి, ఫైర్‌స్టేషన్, జూట్‌మిల్లు మీదుగా పాతబస్టాండ్ మీదగా ఆశ్రం ఆసుపత్రికి చేరుతుందన్నారు. మధ్యాహ్నం 1 గంటకు ఆశ్రం నుంచి తిరుగు ప్రయాణమై తంగెళ్లమూడికు చేరుతుందన్నారు. ఆశ్రంలో వైద్య సేవలు పొందేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హెల్మెట్ ధారణతో ప్రయాణం సురక్షితం


ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: సురక్షిత ప్రయాణానికి హెల్మెట్‌ను ధరించడం శ్రేయస్కరమని ఆర్టీఓ ఎండీ మదని అన్నారు. జంగారెడ్డిగూడెం ప్రధాన కూడళ్ల వద్ద సోమవారం ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మదని మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది తలకు బలమైన గాయాలు కావడం వల్లే మృత్యువాత పడుతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించని వాహనచోదకులకు జరిమానాలు విధించడంతో పాటు అవగాహన కల్పిస్తామని చెప్పారు. హెల్మెట్ లేకుండా బయటకొచ్చే ద్విచక్రవాహనచోదకులు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు రూ.1000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్లు నడిపే వారు విధిగా సీటు బెల్టు ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ ఎస్ఎస్ రంగనాయకులు, ఏఎంవీఐ పీజే సురేష్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై పి.రామకృష్ణ, ఎంవీఐ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని యూనియన్ (ఆంధ్రాబ్యాంక్) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ యువతీ యువకులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఏర్పాటు చేశామని ఆ సంస్థ డైరెక్టర్ కె.శిధర్ తెలిపారు. శిక్షణ నవంబర్ 4వ తేదీ నుంచి ప్రాంభిస్తామని, శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఫోన్ నెంబర్లు 95027 23561, 90140 40780, 95330 79471లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

అట్టహాసంగా కుంతీదేవి ఊరేగింపు


ఊరేగింపులో శక్తి వేషధారణలు


ద్వారకాతిరుమల క్షేత్ర వీధుల్లో ఊరేగుతున్న కుంతీదేవి

ద్వారకాతిరుమల: క్షేత్రంలో కుంతీదేవి అమ్మవారి ఊరేగింపు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఎస్సీ కాలనీలోని రామాలయం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి గ్రామ పెద్దలు యిమ్మడి నాగు, యిమ్మడి రత్నాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, గువ్వల మావుళ్లు, ఆర్కే, కమిటీ సభ్యులు విశేష పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు అమ్మవారి ఉత్సవ మూర్తిని శిరస్సుపై పెట్టుకుని కాలనీలో వీధుల్లో తిరిగారు. ఆ తరువాత విశేష పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని వేంచేపు చేసి, చిత్ర విచిత్ర వేషధారణలు, తీన్మార్ డప్పు వాయిద్యాల నడుమ క్షేత్ర పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. వేడుక అనంతరం రాత్రి అమ్మవారిని నిమజ్జనం చేశారు.